పునర్జన్మ



ఒకసారి కళ్ళు మూసుకుని, అలా నిముషం వుండి, కళ్ళు తెరిచిన ప్రసన్న 'అబ్బ!' అనుకున్నాడు బాధగా.

వీధి వరండాలో నిలబడి, అవతలికి చూస్తూ, ఆలోచిస్తున్నాడతను ఇందాకటి వించీ.

నాలుగు వాటాలుగా వున్న ఆ డాబా ఇంట్లో, వీధివేపు వాటాలు రెండిట్లో, పెద్ద ఇంట్లో ఆఫీసరు, భార్య, రెండో దయిన ఒకే గదిలో ప్రసన్నా వుంటున్నారు. వెనకవి రెండు వాటాలలో రెండు చిన్న కుటుంబాలుంటున్నాయి.

ప్రసన్నది పక్క పల్లెటూరు. అక్కడ బాబాయే అయినవాళ్ళందరిగా, అతని దగ్గర పెరిగి, ఇంటరు పాసయి, భుక్తిని వెదుక్కుంటూ ఈ వూరొచ్చేడు. ఆస్తి, డిగ్రీ ఏవీ లేకపోయినా, ఆకలి, అవసరమూ వుంటాయి. ప్రసన్న అనేక మందిని ఆశ్రయించేడు ఏదో పని దొరుకు తుందని. న్యూసుపేపర్లు పంచే వుద్యోగం దొరికింది.

అవాళ డ్యూటీ ముగించుకుని వచ్చి, వీధివరండాలో నిలబడ్డాడు. సాయంత్రం చల్లదనాన్ని అనుభవిస్తూ, చక్కదనాన్ని చూస్తూ. పక్కవాటాలోంచి ఆఫీసరు రవిచంద్రగారి భార్య మాటలు గట్టిగా వినిపించేయి!

"....కూచోమంటే కూచోరు! పడుకోరు! ఎందుకా లేవడం? పెద్ద ఏదో పనివున్నవాళ్ళకి మల్లేనూ? చేతకాని మనిషి చేతకానట్టు వుండాలి!...."

"తారా!" అరిచేడు రవిచంద్ర.

"అలా సాధించే బదులు ఇంత విషం ఏ అన్నంలోనో కలిపి పెట్టెయ్యవే! నా పీడ వదలిపోతుంది నీకు!"

"ఇద్దరంవూ ఒక్కసారే చద్దాం!"

"నువ్వెందుకు చావడం? నీకు నేను బరువు గదా! నేను లేకపోతే నీకు నా

చాకిరీ, కష్టం వుండవు గదా! అప్పుడు నువ్వు హాయిగా వుండొచ్చు!"

అతను లోపల్నుంచీ వస్తున్నాడు గోడలు పట్టుకుని, తడుముకొంటూ! ప్రసన్న వెళ్ళి రవిచంద్రని పట్టుకుని తీసుకువచ్చేడు.

తార ఓ కుర్చీ తెచ్చి వరండాలో వేసింది.

"ఫానాగిపోయిందోయ్, ప్రసన్నా! వెధవ వుక్క, దోమలు చంపేస్తోంటే, బయటకి వద్దామనీ...."

అతను కుర్చీలో కూర్చున్నాక, ప్రక్కన నేలమీద చతికిలబడ్డాడు ప్రసన్న.

"మా ఆవిడచేత ఎన్ని మాటలనిపించుకుంటున్నానో చూడు ప్రసన్నా! పరాయి వాడివయినా, నీకు నా మీదున్న సానుభూతి నా భార్యకి లేదోయ్!"

"నేనూ మీ భార్యగారి స్థానంలో, రోజంతా మీతో వుంటే, అప్పుడు నాకూ ఆవిడంత విసుగు కలుగుతుందేమో, సార్!" అన్నాడు ప్రసన్న నవ్వి.

"నిజమే నిజమే." అన్నాడు రవిచంద్ర.

"ప్రతి చిన్న అవసరానికి అవతలి వాళ్ళమీద పడడం, వాళ్ళకి ఇబ్బందిగానే వుంటుందిలే!" చూపులేని కళ్ళు, నీళ్ళని రానిచ్చే యివతలికి.

రెండు మాసాలయింది, రవిచంద్రకి ప్రమాదం జరిగి. స్కూటర్ మీద, ఆఫీసు నుంచీ వస్తూ, దోవలో మరో స్కూటర్ గుద్దేయగా తూలిపడిపోయేడు. అతడికీ ఇతనికీ కూడా ఒంటికి దెబ్బలు తగిలేయి కాని, రవిచంద్రకి కళ్ళమీద తగిలి చూపుపోయింది.

రవిచంద్ర ప్రసన్న భుజం తట్టి అన్నాడు.

"నువ్వెన్నాళ్ళిలా ఒక్కడివీ వొండుకు తింటూ, ఒంటరి బతుకు బతుకుతావు?"

"ఒద్దుసార్! వున్నన్నాళ్ళిలా వుంటాను". అన్నాడు ప్రసన్న.

"వచ్చింది సరిపోదన్నా, ఇద్దరికీ?"

ప్రసన్న సెలవుపేసు చాలా సేపటికి. తన గదిలోకి వచ్చి అన్నం తిని పడుకున్నాడు. అతని కళ్ళవెంబడి రెండు కన్నీటి చుక్కలు రాలి పక్కమీదపడి ఇంకిపోయేయి.

* * *

ఐయ్ స్పెషలిస్ట్ డాక్టర్ పాణి ఇంట్లో ఆ సాయంత్రం సాహిత్యసభ జరుగుతోంది. పాణి డాక్టరు, సాహిత్యప్రియుడు కూడా. డిస్పెన్సరీ, ఇల్లు పక్కపక్కనే వున్నాయి. ప్రతీ నెలా ఒక ఆదివారం సాయంత్రం రెండు గంటలు తన ఇంట్లో సాహిత్య సమావేశం ఏర్పాటుచేస్తాడు అతను. మిత్రులకి పోస్టుద్వారానూ, పేపర్లో ప్రకటనద్వారానూ తెలియచేయబడుతుంది. రచనలు ఎవరు వ్రాసినవి వాళ్ళు చదువుతారు. తర్వాత వాటిమీద చర్చ జరుగుతుంది.

ఆరోజు సుమారు పాతికమంది రచయితలు, సాహితీ అభిమానులూ వచ్చేరు. ప్రసన్న వచ్చేడా సభకి. అతను పుస్తకాలు చదువుతాడు. పేపర్లో ఆరోజు ప్రకటించిన సాహిత్య సమావేశం, స్థలం వివరాలు చూసి వచ్చేడతను.

ఆరోజు స్వీయరచనా పఠనం జరిగిన వెంటనే చర్చని ఆపుజేసాడు పాణి. తనొక ముఖ్యవిషయం చెబుతానన్నాడు.

"ఫ్రెండ్స్! నేను చెప్పేది వైద్య పరమైనదే కాదు; మొత్తం సృష్టిపరమైనది! మానవులందరి కర్తవ్యపరమైనదీ!

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం!" అన్నట్టు కన్నుకి శరీరాంగాలలో ప్రత్యేక ప్రాశస్త్యమున్నది!

"ఒకప్పుడు కన్నుపోతే మనిషికి మరో మార్గం లేదు! జీవితాంతం చీకట్లో బ్రతకాల్సివచ్చేది. ఇవాళలా కాదు సైన్సు వైద్యం పురోగమించేయి.

"కళ్ళకి వచ్చే అనేకరకాల జబ్బుల్ని పోగొడుతున్నాము! ఆపరేషన్లుచేసి ఆరోగ్యవంతమైన కళ్ళని అమరుస్తున్నారు! అన్ని దానాల్లో అన్నదానం గొప్పది అంటారు. నా మాటేమిటంటే అన్నదానం కంటే కూడా కన్నుదానం గొప్పదని!! నే నివాళ చెప్పే విషయం ఇదే! మన కళ్ళని మనం బతికివున్నంత కాలం వాడుకోవచ్చు! మరణానంతరమే వాటిని తీసి అంధులకమర్చుతారు ముందుగా మాత్రం కళ్ళని దానం ఇస్తున్నట్టు పేరు నమోదు చేయించుకోవాలి."

పాణి కనుసైగ చేయగానే అతని అసిస్టెంటు కుర్రాడు ఒక బంతిలా వున్న కన్ను ఆకారాన్ని తెచ్చి టేబిలుమీద పెట్టాడు.

"ఇది కన్ను, ఇది తెల్లగుడ్డు, ఇది నల్లగుడ్డు. మనం చూసే దృశ్యం ఈ నల్లగుడ్డుమీదపడి ప్రతిఫలిస్తుంది. ఎదుట వున్న అందాన్ని, అధిక్యతని, మంచిని, చెడ్డని గ్రహిస్తాం! నల్లగుడ్డు అంటే కార్నియాకి దెబ్బ తగిలితే చూపు పోతుంది దెబ్బ మరీ బలంగా అంటే లోపల మెదడుకి జ్ఞానాన్ని తీసుకువెళ్ళే నరాలు తెగినట్టు దెబ్బతగిలితే కష్టం కాని ఈ కార్నియాకి దెబ్బతగిలి దృష్టి లోపిస్తే మాత్రం ఆరోగ్యవంతమైన కార్నియా నమర్చి దృష్టి తీసుకురావచ్చును.

"నేను మిమ్మల్ని మిత్రుడిగా, వైద్యుడిగా కోరేది... మీరంతా మీ నేత్రాలను డొనేట్ చేయాలి! మేం ఇచ్చిన ఫారంను ఫిలప్‌చేసి ఇవ్వండి. మరో మాట చెబుతున్నా! మీరు జీవించినంత కాలమూ మీ కళ్ళు మీతోనే వుంటాయి. మరణానంతరమే వాటిని తీసి అంధులకమర్చుతారు.

వచ్చినవాళ్ళల్లో పదిమంది తాము తమ కళ్ళని దానం ఇస్తున్నట్టు ప్రకటించేరు. మిగిలినవాళ్ళు మళ్ళా కలుస్తామని చెప్పి వెళ్ళారు. ప్రసన్న తన

కళ్ళని డొనేట్ చేసేడు. డాక్టరు అతన్ని ప్రశంసించేడు.

ప్రసన్న ఇంటికి వెళుతూ, దోవలో మెడికల్ షాపులో తనకి కావలిసిన టాబ్లెట్లు కొనుక్కున్నాడు.

* * *

హోరున వాన పడుతోంది. ఆకాశం మబ్బుల్తో నల్లగా కాటుకపూసినట్టుంది. చెవులు బద్దలయేలా ఉరుములు. ఎక్కడో ఇంకాక ఓ పిడుగు పడింది.

ప్రసన్న సైకిలుమీద, పేపర్లకట్ట కట్టుకొని తొక్కుతున్నవాడు, వాన రావడంతో, ఓ ఇంటి ఆవరణలోకి వెళ్ళేడు గబగబా. తను తడిసినా ఫర్వా లేదు, పేపర్లు తడవకూడదు।

ఆ ఇంటివాళ్ళనడిగి, వాళ్ళరుగుమీద పేపర్లు పట్టుకు నిలబడ్డాడు. ఉధృతంగా పడిన వాన, అరగంట అయేసరికి వెలిసింది. మబ్బు లటుఇటు చెదిరేయి. గాలి ధారాళంగా వీచింది. వెలుగూ, ఆ తరవాత కొంచెం ఎండా వచ్చేయి.

ప్రసన్న మళ్ళా పేపర్లకట్టతో సైకిలు తొక్కుతున్నాడు. రెండు ఇళ్ళలో ఇచ్చేదంతే. గుండెల్లో నెప్పి వచ్చేసింది. గుండె నిమురుకున్నాడు. పేపర్లు ఇంకా కొన్ని ఇళ్ళల్లో ఇవ్వాల్సివుంది। ఎలా ఇప్పుడు?

నెప్పితగ్గుతుందేమోనని చూసేడు. సైకిలు దిగిపోయేడు. రోడ్డు పక్కన పేవుమెంటు మీద నిలబడిపోయేడలా, చేత్తో గుండె రాసుకొంటూ.

జేబులో గుండెనెప్పి మాత్రలు ఎప్పుడూ సిద్ధంగా వుంచుకొంటున్నాడీ మధ్య। రెండుసార్లు సన్నగా వచ్చింది నెప్పి। మరోసారి కొద్దిగా ఎక్కువగానే వచ్చింది।। అప్పుడే డాక్టర్ని కలిసేడు, ఆయన టాబ్లెట్లు రాసిచ్చేడు, ఎక్కువ శ్రమపడవద్దన్నాడు.

శ్రమ పడకుండా తనకి ఎలా అవుతుంది. పనుండకపోతే ఏం తింటాడు? ఎక్కడ వుంటాడు?

బాబాయి అతన్ని వీలయినంతకాలం వుంచుకున్నాడు. ఇంటరు అవగానే, "ఇంక నీ బతుకు నువ్వు బతకమని" చెప్పేసేడు.

ఇంకా నయం। ఈ పనయినా దొరికింది। ఇదిగో। ఈ ఆఫీసరుగారే తన తరపున పూచీపడి, వాళ్ళకి హామీ ఇచ్చి, ఈ పేపర్లు పంచే పనిని ఇప్పించేరు।।

ఎందరో కష్టపడుతున్నారు అనేక పనులికి। తను చిన్నతనంనించీ కొంచెం బలహీనుడే అయినా, అలాగే తన జీవితం కొనసాగుతుందనుకున్నాడు కాని.... ఇలా గుండెనెప్పి వస్తుందని.... చావు చాలా తొందరగానే తనని పలకరిస్తుంది అని అనుకోలేదు।।

ప్రసన్న జేబులోంచి మాత్ర తీసి వేసుకున్నాడు. ఆ పక్క కిళ్ళీబడ్డీలో సోడా తాగేడు, నీడలో కాస్సేపు నిలబడ్డాడలా.

చాలా నీరసంగా వుంది! ఒళ్ళంతా చెమట్లుపోసేయి. ఇప్పటికి కొంచెం తగ్గింది! మళ్ళా ఏ నిముషాన నెప్పి వస్తుందో తెలీదు!

నింపాదిగా బయలుదేరేడు. మరి నాలుగిళ్ళల్లో పేపర్లు ఇచ్చేడు. ఆ తరవాత మాత్ర, మరి కొనసాగలేకపోయేడు.

సైకిల్ని నడిపించుకొంటూ, అక్కడికి రెండు సందులు వున్నా, తనింటికి తిరుగు ముఖం పట్టేడు.

ఆ ప్రాంతి పొందుతుంటూండే, మళ్ళా నెప్పి వచ్చింది!

బాధతో విలవిల్లాడిపోయేడు ప్రసన్న. స్టౌవ్‌మీద గిన్నె అలాగే వుంచేసి, చాప మీద వాలిపోయేడు.

అతని గదిలో మూలుగు వింది తార. కంగారుగా వెళ్ళి చూసింది.

"ఏమయిందయ్యా?" అడిగింది.

ప్రసన్న పరిస్థితి పోల్చింది.

"ఇప్పుడే వచ్చిందా?"

"వూఁ...." అన్నాడు. ఇంతకు ముందు నెప్పి వచ్చినట్టు చెబితే, వాళ్ళిద్దరూ చాలా కంగారుపడిపోతారు! ఎందుకు తమకి చెప్పలేదని అడుగుతారు! ఏదో చిన్నగా నెప్పివస్తే, తగ్గిపోతుంది లెమ్మని, దానికి అందరికీ చెప్పడం ఎందుకని వూరుకున్నాడు. వాళ్ళలాంటి వాళ్ళంటే, అసలు, తనని వొండుకోవద్దన్నారు! తమ ఇంట్లోనే ఓ ముద్ద పడేస్తామని, అంతగా తనకి మొహమాటం పడితే అందుకు ప్రతిఫలం ఇవ్వమన్నారు!! కాని, తనందుకు ససేమిరా ఒప్పుకోలేదు! పనిప్పించడం కాకుండా, ఇంకా భోజనం కూడానా? అని చచ్చే సిగ్గువేసింది తనకి!

ఆవిడ వెళ్ళి డాక్టర్ని పిలుచుకు వచ్చింది.

ఆయన దగ్గర మాత్రం ప్రసన్న గుట్టు బైటపడిపోయింది! ఆయన "ఇలా ఇంతకు ముందు వచ్చిందా?" అనడిగితే తలవూపేడు.

తార, రవిచంద్ర ముఖాలు చూసుకున్నారు.

డాక్టరు ప్రిస్క్రిప్షను ఇచ్చివెళ్ళగానే, ప్రసన్నకి చీవాట్లేసేరిద్దరూ. ఆ నిముషంలో అతడికి వాళ్ళు తనికిలేని తల్లితండ్రుల్లా తోచి, కళ్ళల్లోంచి ధారాపాతంగా నీళ్ళొచ్చేయి.

ఆఫీసరు స్టేటస్‌లో వున్నా, వాళ్ళకి ఆ అహంకారం, అతిశయం లేవు! వాళ్ళెంత మంచి మనసులు!! వాళ్ళ దయని, మంచితనాన్ని పొందడం తన అదృష్టం!! ప్చ్! ఈ అదృష్టం ఎన్నాళ్ళు నిలుపుకోగలడు?!

తార వెళ్ళి మందులు కొనుక్కొచ్చింది.

ప్రసన్నకి డాక్టరు ఇందాక ఒక ఇంజక్షనిచ్చేడు, మాత్రవేసాక అతనికి నిద్రపట్టింది.

డాక్టరు చేసిన హెచ్చరిక, రవిచంద్ర దంపతులికి, ప్రసన్నకి మతులు పోగొట్టేసింది.

"ఇది ఫస్ట్ ఎటాక్! సెకండ్ టైం రాకూడదు! వస్తే బ్రతకరు! రాకుండా చూసుకోండి!"

వాళ్ళిద్దరు కళ్ళు తుడుచుకున్నారు.

అంత చిన్నతనంలో ఆ అబ్బాయి కేమిటీ విపరీతం?!

దరిద్రం, ఒంటరి బతుకు, ఒంటి కష్టం!! ఆ బలహీనుణ్ణి మరింత హీనం చేసివేసాయి! ఆ గుండెలో మినుకు మినుకుమనే దీపం, ఏ నిముషం ఆరిపోతుందో తెలీదు!!

"సార్! మీ రేడవకండి! మీ రేడిస్తే నాకు చాలా భయంవేస్తూంది!" అన్నాడు ప్రసన్న.

"మీరు పెద్దవాళ్ళు! నన్ను వూరుకో బెట్టాలి! అలాంటిది మీరే...."

తార ఆ అబ్బాయిని, తన కన్న కొడుకులా ఒళ్ళో తలవుంచుకు, జుత్తు నిమిరింది. తమకి పిల్లలు కలగపోయినా, ఈ అబ్బాయిని తమ సంతానంలాగే చూసుకొంటున్నారు!

ఆ ముచ్చటా తీరిపోతుందా?!....

ప్రసన్న బాబాయికి వైరిస్తామని వాళ్ళు అంటే వద్దన్నాడు ప్రసన్న. వాళ్ళని బాధపెట్టడం తన కిష్టంలేదని చెప్పాడు. వూరుకున్నారు.

ప్రసన్నని డ్యూటీకి వెళ్ళవద్దన్నారు రవిచంద్ర, తార.

"వెళ్ళకపోతే ఎలా?"

"ఎలాలేదు, ఏంలేదు! వెళ్ళొద్దు!"

"మీకు తెలీదు! నా జీవనం ఎలా?"

"మేం వున్నామయ్యా! నీ తిండికేం ఫర్వాలేదులే! ఇల్లంటావా? మేం కడతాంలే!"

"వూరుకోండి సార్! మీకే వుద్యోగం పోయింది.... జీతం లేదుగదా?"

"చూడు ప్రసన్నా! మాకు వుద్యోగం లేకపోయినా జరుగుబడి వుంది. మద్రాసులో రెండిళ్ళమీద అద్దెలొస్తాయి. ఏదో కొంత పంట వస్తుంది. నువ్వు ఆలోచించడం మానేసి రెస్టు తీసుకో."

"సార్! ఈ రోజుల్లో వుండాల్సిన వాళ్ళుకారు సార్ మీరు!" ఏడ్చేసేడు ప్రసన్న.

* * *

ఆ అబ్బాయి కోరికమీద రవిచంద్ర ఐయ్ స్పెషలిస్ట్ పాణి దగ్గరికి వెళ్ళేడు ప్రసన్నతో కలిసి. తనకి మళ్ళా కళ్ళు వస్తాయనుకోవడమేమిటి ప్రసన్నా? పోయిన కళ్ళు అలానే పోవుగదా?!

ప్రసన్న పట్టుబట్టేడు.

"అలా నిరుత్సాహపరకండి సార్! ఏమో! మీకు మళ్ళా చూపొచ్చే ప్రాప్తం వున్నదేమోనని నాకా రోజున డాక్టరు మాటలవల్ల గట్టిగా అనిపించింది సార్! మీ అదృష్టం సార్! కార్నియా ఒక్కటే దెబ్బతిని వుంటే మాత్రం.... మీకు

డాక్టరుగారు పునర్జన్మ నివ్వగలరు।"
అని చెప్పేడు.

ఆ మాటలకి రవిచంద్రతోబాటు తారకి ఆనందంతో ఒళ్ళు చిన్నగా కంపించింది. ప్రసన్న మాటే నిజం అయితే తమంత అదృష్టవంతు లుండరు.

డాక్టర్ పాణి రవిచంద్రని పరీక్ష చేశాడు.

ఆయన ముఖం సంతోషంతో వికసించింది.

"మీరు లక్కీ ఫెలో।" అన్నాడు.

ఆ క్షణం రవిచంద్రకి లోకం పూల తేరులా, తనందులో చోదకుడిలా అనిపించింది. డాక్టరుకి థాంక్సు చెప్పి అక్కడే ప్రసన్నని గట్టిగా కౌగలించుకున్నాడు.

అపరేషను ఎప్పుడు చేస్తారని అడిగేడు రవిచంద్ర. పాణి తనవద్ద బ్యాంకులో ప్రస్తుతం కళ్ళదాతల పేర్లు నమోదయి వున్నవి. ఎవరయినా కళ్ళు ఇచ్చినట్లయితే మీకు ఆపరేషన్ చేస్తాను" అని చెప్పేడాయన.

వాళ్ళిద్దరు ఇంటికి వచ్చేరు

"నా జన్మ పరిపక్వం కావడానికి ఇంకా కొంతకాలం వుంది" అని రవిచంద్ర భార్యకి చెప్పేడు.

ఆరోజు వుదయంనించి ప్రసన్న చూస్తున్నాడు. వింటున్నాడు. ఆఫీసరుగారు, భార్యా పడే అవస్థని.

అవిడెందుకో విసుక్కుంటున్నది. ఆయన "ఎందుకే, అలా చిరాకుపడతావు। తొందర్లో నాకు కళ్ళు వచ్చేస్తాయి గదా। ఈ లోపున నువ్వు అస్తమానమూ నామీద చిరాకుపడకు। కొంచెం నీ కోపాన్నీ, విసుగునీ అరికట్టుకో।" అంటున్నాడు.

ప్రతిరోజూ ఆయన దేనికో ఆవిడని బతిమాలడం, ఆవిడ చిరాకుపడడం తను వింటున్నదే। చూస్తున్నదే। ఈ రోజు వాళ్ళ మాటల్లో మార్పు వచ్చింది। సార్‌గారి మనసులో ఆశాదీపం ఆరిపోయిందల్లా మళ్ళీ వెలిగింది.

తనే వెలిగించేడు।

తార అంటోంది। "ఆ డాక్టరుమాట సరే। మన బతుకూ సరే। ఎవరో ఎప్పుడో ఇస్తే, అప్పుడు చూద్దామన్నాడా? బావుంది। ఆసరికి మనం కొండెక్కిపోతాంలెండి।"

ఆయన ఆవిడని పిలుస్తున్నాడు. ఆవిడ మాట్లాడుతోందేగాని, ఎందుకు పిలుస్తున్నాడని అడగటంలేదు. ఆయన బతిమాలుతున్నాడు. విసుక్కొంటున్నాడు మాలుగుతున్నాడు. అంతా ప్రసన్న గమనిస్తున్నాడు.

తార లోపలిగదిలోకి వెళ్ళడం చూసి, ప్రసన్న నెమ్మదిగా రవిచంద్రని సమీపించేడు. ఆయన అవసరం ఏమిటో అడగవచ్చా? అనడిగేడు.

రవిచంద్ర వెంటనే ప్రసన్న చేతులు పట్టేసుకున్నాడు. "బాబ్బాబూ। నువ్వు వచ్చేవా? నా పాలిట దేవుడిలా వచ్చేవు।



చచ్చిపోతున్నాననుకో ఇందాకటినించీ! ఆవిడని పిలిస్తే చూడు! విన్పించుకోవడం లేదు!" అన్నాడు.

మంచమ్మీద కూచుని వున్నాడాయన. కట్టుకున్న లుంగిలోకి నల్లిదూరి కుడుతోంది, చాలాసేపటినుంచీ! దాన్ని వెతకలేదాయన! స్పర్శకి అది దొరకడం లేదు! కుట్టి చంపుతోంది! ఆ అవస్థ ప్రసన్న హృదయాన్ని ద్రవీభూతం చేసింది. నల్లిని వెదికి, చంపేసేడు. కళ్ళు తుడుచుకున్నాడు.

"అమ్మయ్యా! రక్షించేవయ్యా బాబూ! నువ్వు రాకపోతే నా పని నరకమే!" అని రవిచంద్ర మళ్ళా కుదురుగా కూచున్నాడు.

వాళ్ళింట్లో అన్నం తిని, ఒక్కసారి అలా బయటికి వెళ్ళివస్తానని చెప్పి వీధిలోకి ప్రసన్న బయల్దేరేడు. వాళ్ళిద్దరూ అతనికి మున్ఫు మూడు జాగ్రత్తలు చెప్పేరు.

అలా వెళ్ళినవాడు ఎంతసేపయినా ఇంటికిరాలేదు.

రవిచంద్ర, తాత గాబరాపడిపోయేరు.

ఎక్కడికి వెళ్ళేడో తెలీదు! మళ్ళా పేపర్ల వుద్యోగానికి బయలుదేరేడేంటి చెప్మా! మొండివాడు! మళ్ళా ఏం తెచ్చుకుంటాడో ప్రాణంమీదికి!....

వాళ్ళ ఆలోచన సరిఅయినదే ప్రసన్న ఇంటినించి మొదట డాక్టర్

పాణి దగ్గరికి వెళ్ళేడు. పాణితో, తను చనిపోతే, తన కళ్ళని, తమ ఇంటిలో వున్న ఆఫీసరు రవిచంద్రకి అమర్చమని కోరాడు.

"అలాగే! కాని.... ఇప్పుడు, మీరు చనిపోవడం ఎందుకు? అర్జెంటుగా?"

ప్రసన్న నవ్వేసేడు.

అవును! అర్జెంటే!! ఇంకెంతకాలం వుంటాడిలా? ఎక్కడికీ కదలక? ఏ పనీ చేయక? ఎన్నో జాగ్రత్తలతో!! నిమిష నిమిషం క్రుంగిపోతూ!! తనకీ బ్రతుకు చాలా దుర్భరంగా వుంది!! ఒకసారి ఎటాక్ వచ్చింది! మరోసారి వస్తే ప్రాణికటే!! అంటే మృత్యువు సగం దూరంలోనే వున్నది, తనకి!! అదెలానూ తనని వదలదు!!

రవిచంద్ర పరిస్థితి చూడలేకపోతున్నాడు తను! తనీ జన్మకి ఎలానూ సుఖపడడు! ఆయన కయినా పునర్జన్మ నివ్వాలి!....

డాక్టరు పాణి దగ్గర, ఆ హామీని తీసుకొని, ప్రసన్న బయల్దేరాడు. పేపర్లు పంచే పనికి మళ్ళా కుదురుకున్నాడు. డ్యూటీలో ప్రవేశించేడు. సైకిలు తీసుకుని, అది వరకులేని స్పీడుతో తొక్కసాగాడు, వెర్రెత్తినట్టు. అన్ని ఇళ్ళల్లో పేపర్లివ్వడం చాలా త్వరగా జరిగిపోయింది!!

అయిపోయింది! తన పనికూడా ముగిసిపోయింది అనుకున్నాడు ప్రసన్న. గుండె పట్టుకుని. ఇంటికి వెళ్ళలేదు. సరాసరి పాణిగారి దగ్గరికి వెళ్ళేడు.

రవిచంద్ర, తారకి కబురు తెలిపాడు పాణి. తన అసిస్టెంటుని వారింటికి పంపి. వాళ్ళు అఘమేఘాల మీద వెళ్ళేసరికి—

ప్రసన్న శరీరం మాత్రం మిగిలి వున్నది అక్కడ! "ఎంత పని చేశావయ్యా!!" అంటూ వాళ్ళు గొల్లుమన్నారు.

ప్రసన్న కోరికమీద, అతని కళ్ళల్లోంచి, రవిచంద్ర మళ్ళా ఈ లోకాన్ని చూశాడు "మీలో మీరిద్దరూ వున్నారండీ! ఇద్దరికీ ఇది పునర్జన్మే!..." అన్నది తార.